క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు



జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రథమ, అర్గుల్ ద్వితీయ, పడకల్ హై స్కూల్‌లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. అనంతరం గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సుధాకర్, బ్యాంకు ప్రతినిధి అశోక్‌లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో గుండె ఆపరేషన్లు చేయాలి



నిజామాబాద్ సిటీ : జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో గుండె సంబంధించిన వ్యాధులకు అన్ని రకాల సేవలు అందించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమల సత్యం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. జీజీహెచ్ నుంచి గుండె సంబంధిత రోగులను హైదరాబాద్‌కు రిఫర్ చేస్తున్నారని, పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు దేశెట్టి సాయిరెడ్డి, పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, విజయ్, గంగాధర్ పీవైఎల్ నాయకులు భాస్కర్, సాయిలు, రఘు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంప్‌నకు విశేష స్పందన



నిజామాబాద్ నాగారం : మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, అర్సపల్లి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అర్సపల్లి క్యాన్సర్ స్క్రీనింగ్ మెడికల్ క్యాంప్‌నకు స్పందన లభించింది. డాక్టర్ రామ్మోహన్‌రావు, డా రవీంద్రనాథ్‌సూరి మాట్లాడుతూ పొగతాగేవారు, పాన్ మసాలా నమిలేవారు, గుట్కా తినేవారు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. అర్సపల్లిలో నిర్వహించిన క్యాంప్‌నకు అధిక సంఖ్యలో మహిళలు, పురుషులు హాజరుకాగా వారికి మెమోగ్రాం, పాప్స్ మియర్, ఈసీజీ, ఎక్స్‌రేలు టెస్ట్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నాయకులు రామ్మోహన్‌రావు, ఈవీఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బంకిం చంద్ర చటర్జీకి ఘన నివాళి



నిజామాబాద్‌నాగారం : శబ్ద తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సరస్వతినగర్ కార్యాలయంలో బంకిం చంద్ర చటర్జీ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి ఐఎంఏ అధ్యక్షుడు పిల్లల వైద్యనిపుణులు డా. నీలిరాంచందర్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శబ్ద తరంగిణి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత ఆచార్యులు సేర్ల దయానంద్, తొగర్ల సురేష్, పోతన్నార్ లక్ష్మన్, హరీష్‌గౌడ్, రాజు, బాలేషా తదితరులున్నారు.

ఆకట్టుకుంటున్న న్యూ రాజస్థాన్ కాటన్ ఫాబ్



నిజామాబాద్ సిటీ : నగరంలోని ప్రగతినగర్ మున్నూరు కాపు సంఘంలో కొనసాగుతున్న న్యూ రాజస్థాన్ కాటన్ ఫాబ్ మేళా నగరవాసులను ఎంతో అలరిస్తోంది. ఈ నెలా 13న ప్రారంభమైన కాటన్‌ఫాబ్ మేళా వచ్చే నెలా జులై 10వరకు కొనసాగనుంది. ఈ మేళాలో పంజాబ్, హర్యాణా, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, బీహర్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, అస్సాం, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన ఉత్పత్తులను మేళాలో ప్రదర్శనలకు పెట్టారు. ఈ సందర్భంగా మహిళలకు సంబంధించి వస్తువులు ఎంతో ఆకట్టుకునే ఉన్నాయి.

నాణ్యత నవ్వులపాలు..

- 41వ డివిజన్‌లో కంకర తేలిన సీసీ రోడ్లు
- రూ. 20లక్షల నిధులు నీళ్ల పాలు



నగరంలోని 41వ డివిజన్‌లో కంకర తేలిన సీసీ రోడ్డు

నిజామాబాద్‌నాగారం : అధికారులు.. కాంట్రాక్టర్‌లు కుమ్మక్కై, రోడ్డు పనులు నాసిరకంగా చేయడం కారణంగా కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. వేసిన రోడ్డు మూణ్నాళ్లకే కంకరతేలడంతో కాలనీవాసుల అవస్థలు అన్నీఇన్నీ కావు. రూ. 20లక్షల నిధులు నీళ్లపాలయ్యాయి. నగరంలోని 41 డివిజన్ పరిధిలోని వసంత్‌నగర్ కాలనీలో పరిస్థితి ఇది..

240 మీటర్ల రోడ్డు..

నగరంలోని 41వ డివిజన్‌లో వసంత్‌నగర్ కాలనీలో సుమారు 240 మీటర్ల రోడ్డు వేయడానికి నిధులు కేటాయించారు. రూ. 20లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ఫిబ్రవరి నెలలో ఇంజినీరింగ్ ఏఈ, కాంట్రాక్టర్‌ల పర్యవేక్షణలో రోడ్డు వేయడం ప్రారంభించారు. అయితే రోడ్డు వేసే సమయంలో నాసిరకంగా వేస్తున్నారని సంబంధిత డివిజన్ కార్పొరేటర్ విన్నవించుకున్నా పట్టించుకోలేదు. సరిగ్గా మూణ్నెళ్ల తర్వాత నాసిరకం కళ్లకు కట్టినట్లు బట్టబయలైంది. మొదటి నుంచి స్థానిక కార్పొరేటర్ ఎన్నిసార్లు చెప్పినా కాంట్రాక్టర్, ఏఈ పట్టించుకోలేదు. పదికాలాల పాటు ఉండాల్సిన సీసీ రోడ్డు ఇప్పుడు కంకర తేలి ఆధ్వాన్నంగా మారింది.

ఎన్నోసార్లు విన్నవించాం..

నాసిరకం రోడ్డు వేశారని నేరుగా మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రాకు వాట్సప్‌లో పలుమార్లు సంబంధిత డివిజన్ కార్పొరేటర్ విన్నవించారు. రోడ్డు స్థితిగతులపై ఫొటోలు, వీడియోలు తీసి పంపించారు. మున్సిపల్ డీఈ, ఇతర అధికారులకు విన్నవించారు. అయినా రోడ్డు బాగు చేయడం లేదు. ఏఈ నిర్లక్ష్యం, కాంట్రాక్టర్‌ల ఇష్టారాజ్యంతో పర్సంటేజీలు తీసుకుని నాసిరకంగా రోడ్డు వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రోడ్డు బాగు చేయించాలి

రూ. 20లక్షలతో చేపట్టిన రోడ్డు గురించి మొదటి నుంచి ఫిర్యాదులు చేస్తున్నాను. నాసిరకంగా వేస్తున్నారని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఇప్పుడు రోడ్డు స్థితిగతులు కళ్లకు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌కు బిల్లు ఆపి రోడ్డును బాగు చేయించాలి. – బూరుగుల ఇంద్ర వినోద్ కుమార్, 41వ డివిజన్ కార్పొరేటర్

కుటుంబ పాలనకు చెక్ పెట్టాలి



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న సూర్యనారాయణ



సిరికొండలో ప్రసంగాన్ని వింటున్న నాయకులు

సుభాష్‌నగర్ : రాష్ట్రంలోని అవినీతి, కుటుంబ పాలనకు చెక్ పెట్టేందుకు ప్రజలు సిద్ధమయ్యారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని మార్వాడిగల్లిలో కంఠేశ్వర్ మండలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మేరే బూత్ సబ్ సే మజ్బూత్' ప్రధాని మోదీ ప్రసంగాన్ని ఎల్‌ఈడీ ద్వారా వీక్షించారు. ఈసందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ దేశంలోని అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం పథకాలు అమల్జేస్తుందన్నారు. టీఆర్‌ఎస్ పాలన కబ్జాలమయమైందని, ప్రజలు విసిగివేసారిపోయారని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందు దొందేనని, ఎవరినీ నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రోషన్, నాయకులు హరీష్, వనిత, సురేష్, భాగ్య, మల్లేష్, లక్ష్మీనారాయణ, వినోద్, ఆనంద్, భాస్కర్‌రెడ్డి, డివిజన్‌వాసులు పాల్గొన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'మేరే బూత్ సబ్ సే మజ్బూత్' ప్రధాని మోదీ ప్రసంగాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఎల్‌ఈడీ ద్వారా వీక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి న్యాలం రాజు, భరత్ భూషణ్, సుక్క మధు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సంక్షేమ పాలన

సిరికొండ : దేశంలో బీజేపీతోనే సంక్షేమ పాలన అందుతుందని పార్టీ మండలాధ్యక్షుడు అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మంగళవారం వీక్షించారు. శక్తి కేంద్రం మండలాధ్యక్షుడు దాసరి లింబాద్రి, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు ధర్పల్లి బాబురావు, బూత్ అధ్యక్షుడు కనగందుల వేణు, తాళ్ల శ్రీనివాస్, సంజీవ్‌రెడ్డి, మారుతి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని వినతి



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఏఈ, రైతులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని న్యాల్‌కల్ శివారులో ఉన్న వ్యవసాయ బోరుబావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని రైతులు విద్యుత్ అధికారులను కోరారు. ఈమేరకు మంగళవారం న్యాల్‌కల్ సబ్‌స్టేషన్‌కు తరలివచ్చారు. మూడ్రోజుల క్రితం న్యాల్‌కల్ శివారులో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేసి కాపర్‌ను ఎత్తుకెళ్లిన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీటి విలువ సుమారు రూ. 25 వేల వరకు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. దొంగతనానికి సంబంధించి రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులు గడిచినా ఇంతవరకూ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈవిషయమై మంగళవారం ఏఈ శ్రీనివాస్‌ను అడగగా, చోరీ విషయమై ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలోనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తామన్నారు. నారు మడులు ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సుభాష్‌నగర్ : నగరంలోని దుబ్బ ప్రాంతంలోగల సర్వేనెంబర్ 171, 172 ప్రభుత్వ స్థలంలో ఇళ్లస్థలాలు పేదలకే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, నగర కార్యదర్శి పెద్ది సూరి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సుభాష్‌నగర్‌లోగల ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో 15 రోజుల క్రితం గుడిసెలు వేసి భూపోరాటం చేస్తున్నామన్నారు. పేదలు రాత్రింబవళ్లు అక్కడే ఉంటూ స్థలం కోసం పోరాడుతున్నారన్నారు. కొందరు తమను ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారన్నారు. ప్రభుత్వ స్థలానికి హద్దులు గుర్తించి రక్షించాలన్నారు. సీపీఎం నాయకులు మల్యాల గోవర్ధన్, బెజగం సుజాత, రాములు, మహేష్, కృష్ణ, నర్సన్న, అనసూయమ్మ, అబ్దుల్, గుడిసెవాసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు కిషన్

నిజామాబాద్‌నాగారం : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అంబేడ్కర్ ఆశయాల కోసం నిరంతరం బొజ్జతారకం కృషి చేశారని, ఇదే స్ఫూర్తితో పోరాటాలు చేయాలని టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ తెలిపారు. మంగళవారం నగరంలో జిల్లా మాలమహానాడు ఆధ్వర్యంలో బొజ్జతారకం 84వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షులు హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు వర్కింగ్ అధ్యక్షులు ఎడ్ల నాగరాజ్, సీపీఎంఎల్ నాయకులు, ఆకుల పాపయ్య, జమాతి ఇస్లామి అధ్యక్షులు, షేక్ హుస్సేన్, జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ అధ్యక్షులు ఎడ్ల ధన్‌రాజ్, కార్యదర్శులు, నాంది వినయ్ కుమార్, బట్టి గంగాధర్, బిఎస్.పి నాయకులు ఎడ్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ సౌకర్యం



రోగిని అంబులెన్స్‌లో తరలిస్తున్న క్లబ్ సభ్యులు

నిజామాబాద్ సిటీ : వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన పేదవ్యక్తి షేక్ జలీల్ దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతుండగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అంబులెన్స్ ఏర్పాటు చేసి హైదరాబాద్‌లోని స్పర్శ కేంద్రానికి తరలించినట్లు రోటరీ క్లబ్ సభ్యులు మంగళవారం పేర్కొన్నారు. రోటరీ సభ్యుడు శ్యాం అగర్వాల్ సొంత ఖర్చుతో ఈ ఏర్పాటు చేశారు. పేదరోగులు తమకు సమాచారమిస్తే హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో తరలిస్తామని రోటరీ క్లబ్ కార్యదర్శి డాక్టర్ వి శాల్ ఆకుల తెలిపారు. రోటరీ అధ్యక్షుడు సతీష్ సాహు, శ్రీనివాసరావు, జగదీశ్వర్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



ఖలీల్‌వాడి : రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. నిజామాబాద్-1, 2 డిపోలు, ఆఫీస్ సిబ్బంది కలిసి 51 మంది రక్తదానం చేశారు. ఓ ప్రైవేట్ బ్యాంక్ ద్వారా దాతలకు పండ్లు జ్యూస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ శంకర్, రీజినల్ హెడ్ శంకర్, డిపో మేనేజర్లు ఆనంద్, వెంకటేశర్లు, పర్సనల్ ఆఫీసర్ పద్మజ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని బాడ్సి గ్రామపంచాయతీలో డి-ఫంట్ కెనాల్ బౌండరీ వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో లింగం నాయక్ మంగళవారం పరిశీలించారు. నర్సింగ్‌పల్లి గ్రామపంచాయతీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ సోక్ పిట్ పనులను తనిఖీ చేశారు. జీపీ కార్యదర్శులు, ఎఫ్ఏ, సిబ్బంది ఉన్నారు.

కార్మికులకు సమగ్ర చట్టాన్ని అమలు చేయాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలకు రూ.600 కూలి పెంచాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా నాయకులు సాయాగౌడ్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. నాయకులు గంగమల్లు, గంగారాం, మహేష్, గోపి, మోహన్, సాయిలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలని వినతి

నిజామాబాద్‌నాగారం : నగరంలోని సిర్నాపల్లి గడి, మహిళా పీఎస్, గోల్‌హనుమాన్ ప్రాంతాల్లో ప్రజలు, వ్యాపారుల అవసర నిమిత్తం మరుగుదొడ్లు నిర్మించాలని పర్యావరణ వేత్త డాక్టర్ సుధీర్‌సింగ్ మంగళవారం కలెక్టర్‌కు విన్నవించారు. ఇక్కడే ప్రభుత్వ స్థలంలో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నిజామాబాద్‌నాగారం : పెన్షనర్లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ కో కన్వీనర్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం నాందేవ్‌వాడలో గల సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 28న(బుధవారం) కలెక్టర్ ఆఫీస్ ఎదుట ఉదయం 10.30 నిరసన చేపడుతున్నామన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



సిరికొండ : మండల కేంద్రంలో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లను జెడ్పీటీసీ మాన్‌సింగ్ మంగళవారం పంపిణీ చేశారు. నోటు పుస్తకాలు, కార్పెట్లను కూడా అందచేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నదన్నారు. విద్య కోసం ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులను కేటాయిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం కల్పన, ఉపాధ్యాయులు దేవిసింగ్, లావణ్య, రజితరాణి పాల్గొన్నారు.

వికలాంగులకు పండ్ల పంపిణీ



నిజామాబాద్‌నాగారం : అవిజ్ఞ చారిటబుల్ ఫౌండేషన్, బాన్సువాడలోని సింధు విద్యాలయం హైస్కూల్ కరస్పాండెంట్ జ్ఞానేశ్వర్,గాయత్రి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని గంగస్థాన్ స్నేహ సొసైటీలోని వికలాంగులకు పండ్లు, భోజనం అందజేశారు. యువకులు, విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలకు ప్రోత్సహించలన్నారు. అవిజ్ఞ చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ఆర్థిక సాయం



డిచ్‌పల్లి : ఈనెల 13న జాతీయ రహదారిపై టిప్పర్ ఢీకొన్న ఘటనలో అమృతాపూర్ పరిధిలోని దేవనగర్‌కు చెందిన అభిషేక్ అనే బీటెక్ విద్యార్థి మృతిచెందిన విషయం తెలుసుకుని మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి అభిషేక్ తల్లి సులోచనకు రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.5లక్షల సహాయం అందజేసి అండగా ఉండాలని డిమాండ్ చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, నడిపల్లి ఎంపీటీసీ ముల్లంగి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు మిట్టపల్లి రాజన్న, లక్ష్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసు ఎత్తివేయాలని వినతి

ఖలీల్‌వాడి : పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి, న్యాయవాది ఆల్గోట్ రవీందర్‌పై ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్ స్టేషన్ లో పెట్టిన ఉపా కేసుని ఎత్తివేసి, ఉపా చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సీపీఐ(ఎం-ఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి వనమాల కృష్ణ, ఏపీకేఎంస్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ హోంమంత్రి మహమూద్ అలీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆల్గోట్ రవీందర్ జిల్లా కోర్టులో గత మూడు దశాబ్దాలుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఏకకాలంలో రుణమాఫీ



మాట్లాడుతున్న రూరల్ ఇన్‌చార్జి భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ. 2లక్షల రైతు రుణాలను మాఫీ చేస్తామని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రూరల్ ఇన్‌చార్జి డాక్టర్ భూపతిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం కల్పించాలన్నారు. వరికి క్వింటాలుకు రూ. 2,500 మద్దతు ధర చెల్లిస్తామన్నారు. ప్రతి ఇంటికి రూ.500లకే సిలిండర్‌ను అందజేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలతో ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, ప్రధాన కార్యదర్శి నాగేష్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, డీసీసీ కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, సాయిరెడ్డి, సంజురెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు వినోద్, ఎన్ఎస్‌యూఐ రూరల్ అధ్యక్షుడు అభిలాష్ తదితరులున్నారు.

ఫోన్ అప్పగింత

ఖలీల్‌వాడి : నగరంలోని కెనాల్‌కట్ట దుబ్బ ప్రాంతానికి చెందిన శ్రీకాంత్ జవర్ అనే వ్యక్తి మొబైల్ ఫోన్ పది రోజుల కిందట పోయిందని త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా త్రీటౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ ఆ ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి ఫోన్‌ను ట్రాక్ చేసి మంగళవారం ఫిర్యాదుదారుడికి అప్పగించారు. ఇప్పటివరకు త్రీటౌన్ పరిధిలో 23 ఫోన్లను ట్రేస్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల పరిశీలన



ధర్పల్లి : మండలంలోని రేకుల పల్లి దుబ్బాక గ్రామాల్లో బీసీలకు రూ. లక్ష పథకం కింద ఆర్థిక సహాయం కోసం చేసుకున్న దరఖాస్తులను ఎంపీడీవో లక్ష్మణ్ మంగళవారం పరిశీలించారు. దరఖాస్తుల ప్రకారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నారు. తుది జాబితాను తయారుచేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, అర్హులకు ఆర్థిక సహాయం అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,700	వెండి (కిలో)	73,700
22 క్యారెట్స్	55,962	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	240
		లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	68	90	గాజరుగడ్డ	40	60
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	60	80
బీరకాయ	60	80	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	15	30
బీర్నిసుకాయ	100	130	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	40	60
వంకాయ	20	40	బీట్‌రూట్	30	50
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	50	70	చామగడ్డ	35	60
కొత్తిమీర	70	90	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	70	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	40	60			

– ఇందూరు

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	1920 హర్రర్ ఆఫ్ ది హార్ట్ -10.50,4.30, 1.30,10.15; అశ్విన్స్ -7.30
స్క్రీన్-2	ఆదిపురుష్(తెలుగు) -1.39,7.39
స్క్రీన్-3	ఆది పురుష్(తెలుగు)- 1.30,7.10 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆదిపురుష్(తెలుగు) 3డీ – 11.15,3.00 6.45,10.30
స్క్రీన్-2	-ఆదిపురుష్(తెలుగు)3డీ -10.15 2.00 5.45 9.30
స్క్రీన్-3	భీమదేవరపల్లి బ్రాంచి (తెలుగు)- 11.10,7.10; 1920 హర్రర్ ఆఫ్ ది హార్ట్ (హిందీ)-2.05,10.05; ఎలిమేట్(ఇంగ్లీష్)2డీ -4.50
స్క్రీన్-4	ఎలిమేట్(ఇంగ్లీష్)2డీ-11.00; కుట్ర(తెలుగు)-1.20; ది ఫ్లాష్(ఇంగ్లీష్)-3.45; భారీ తార ఘనా -(తెలుగు)-6.55; అశ్విన్స్(తెలుగు)-10.00
దేవి	అశ్విన్స్(తెలుగు)
నటరాజ్	1920 హర్రర్ ఆఫ్ ది హార్ట్(తెలుగు)
లలితామహల్	మను చరిత్ర
విజయ్	ఆది పురుష్ (తెలుగు)

గురుపౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి : గురుపౌర్ణమి సందర్భంగా జూలై 3న తమిళనాడులోని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణనకు నిజామాబాద్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు ఆర్ఎం ఉషాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు వారి కాలనీల్లో 30 మంది ప్రయాణికులు ఉన్న వారి వద్దకే బస్సు పంపుతామన్నారు. ఆసక్తి గల వారు ఈ కింది ఫోన్ డిపో మేనేజర్, నిజామాబాద్-1, 9959226016, డిపో మేనేజర్, నిజామాబాద్-2, 9959226017 నంబర్లను సంప్రదించాలన్నారు. ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి పరీక్ష షెడ్యూల్ విడుదల

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పోస్టుల భర్తీకి జూలై 24, 25, 26 తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందన్నారు. జూలై 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. జిల్లాలో స్పెషల్ ఆఫీసర్, పీఆర్‌టీ, పీఈటీ, పీజీ, సీఆర్‌టీ పోలీసులకు సంబంధించి 28 పోస్టులు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఒక పోస్టును భర్తీచేయనున్నారు.